

## వయోజనుల కోసం మార్గదర్శిని

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

నిరక్షరాస్య వయోజనులు చదువులో ముందడుగు వేయడానికి అక్షర వికాసం, మార్గదర్శిని పుస్తకాలు ఉపయుక్తమవుతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో, జిల్లా వయోజన విద్యాశాఖ రూపొందించిన ఈ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులకు అక్షరాస్యత కల్పిస్తున్నామని తెలిపారు. చదువు ఆగిపోయిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, డీఆర్‌పీలు జనార్ధన్, సుమన్ పాల్గొన్నారు.

## పెద్దపల్లి మున్సిపల్ మేనేజర్ కు సన్మానం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** పెద్దపల్లి మున్సిపాలిటీ మేనేజర్ మామిడిపల్లి లింగయ్యకు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మామిడిపల్లి లింగయ్య సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులు బొంకూరి దుర్గయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, పట్టణ అధ్యక్షురాలు రామిల్ల శారద, గుండవేణి స్వామి, కాసిపేట ఉదయ్, అడ్లూరి గంగారాం, కావ్వంపల్లి మారుతీ, పోలుదాసరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాలు సామరస్యంగా జరపాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సామరస్యంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయంలో డీసీపీ ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండపాల ఏర్పాటు కోసం పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి, అనుమతిపొందిన వారికి ఉచిత విద్యుత్ అందిస్తామని తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మండపాలు వద్దు, రక్షణాత్మక వైరింగ్ చేయాలని సూచించారు. అగ్నిమాపక, వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండాలని, నిమజ్జనం ప్రాంతాలు, పారిశుధ్యానికి ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, సింగరేణి ఆధ్వర్యంలో క్రేన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. డీసీపీ ఎ. భాస్కర్ మాట్లాడుతూ గతేడాది 2,400 మండపాలకు అనుమతులు ఇచ్చామని, ఈసారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గొడవలు లేకుండా నిఘా ఏర్పాటు చేస్తామని, మండప నిర్వాహకులు రాత్రివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, భారీ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### మట్టి గణపతులకు ప్రాధాన్యం

ఈనెల 27న జరగనున్న వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను అందరి బాధ్యతగా భావించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు నీటిలో కరుగక కాలుష్యాన్ని పెంచుతాయని, జలచరాలకు ప్రమాదకరమని తెలిపారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సాంప్రదాయాలు, సంస్కృతి నిలువడంలో సహాయపడుతుందన్నారు. విగ్రహాల పంపిణీ ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించడం అని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







## ర్యాగింగ్‌లో చిక్కుకుంటే భవిష్యత్ నాశనం

- మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ ఘటనల్లో చిక్కుకుంటే విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ, బీఎస్సీ నర్సింగ్ కాలేజీలో సోమవారం యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆయన సూచనలు ఇచ్చారు. ఏసీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను ఉన్నత చదువులకు పంపుతారని, కానీ కొందరు విద్యార్థులు వారి ఆశలను తారుమారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అయితే భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు దక్కవని స్పష్టం చేశారు.

### ఫిర్యాదు చేయండి – గోప్యత కాపాడుతాం

ర్యాగింగ్ ఘటనలు ఎదురైతే వెంటనే 100కు కాల్ చేయాలని, లేక స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్, మెడికల్, నర్సింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మంచిర్యాలలో గంజాయి స్వాధీనం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జాఫర్‌నగర్‌లో పోలీసు లు 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపతి సోమవారం ఉదయం నిర్వహించిన తనిఖీల్లో గూడెల్లి సాయికుమార్ (27) బల్లార్షా నుంచి కొనుగోలు చేసి మంచిర్యాలకు తిరిగి వస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పలు అర్జీలు స్వీకరించారు. సాగుభూముల పై అక్రమ ఆక్రమణలు, పట్టా మంజూరు, విద్యా సీట్లు కేటాయింపు, ఇండ్ల జాబితాలో పేర్లు చేర్చడం, పింఛన్లు, ఉపాధి కల్పన, పారిశుద్ధ్యం, రేషన్ డీలర్ల కమిషన్, రహదారి మరమ్మత్తులు, వంతెన నిర్మాణం వంటి సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కలెక్టర్ అన్ని దరఖాస్తులను సంబంధిత శాఖలు త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో మంచిర్యాల..

- జిల్లా శ్రేయస్సే ముఖ్యం
- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



జిల్లా ప్రజల శ్రేయస్సే తన కర్తవ్యమని, అభివృద్ధి పనులు అడ్డుకునే వారెవరైనా తప్పక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. అనారోగ్యం నుంచి కోలుకున్న అనంతరం సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన అభివృద్ధి అంశాలను వివరించారు.

తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే కృషి కొనసాగుతుందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అభ్యర్థనలపై వెంటనే స్పందించి అనుమతులు ఇస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాలలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు పూర్తయ్యాక కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. పాతబడిపోయిన బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాల భవనాలను కూల్చి కొత్త భవనాలు నిర్మించనున్నట్టు వివరించారు. హాజీపూర్ మండలం ముల్కల వద్ద ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో రెండు వేల మందికి ఉపాధి లభిస్తుందని, జిల్లాలో 220 మెగావాట్లతో పాటు లక్షెట్టిపేట, నస్పూర్ ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. బతుకమ్మ కానుకగా మహిళలకు శ్రీశక్తి భవనం నిర్మాణం ప్రారంభమైందని చెప్పారు. త్వరలోనే జిల్లాకు నవోదయ హైస్కూల్ మంజూరు కాబోతోందని, విద్య, వైద్యం కోసం హైదరాబాద్ వెళ్ళాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలు జిల్లాలోనే కల్పిస్తామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో శాంతి భద్రతలు సవ్యంగా ఉన్నాయని, వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాలేజీలో మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జన్నారం మండల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మరుగుదొడ్లు పనికిరాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. వాటర్ సప్లై లేకపోవడం, పైప్‌లైన్లు పగిలిపోవడం, మూత్రశాలల్లో లీకేజీలు కారణంగా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయని, దీనివల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. ప్రత్యేకంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మౌలిక వసతుల లోపం హాజరు, ఆరోగ్యం, విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని తెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# పర్యావరణహితం మట్టిగణపతి



- సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పొట్రు

**శెనార్తి మీడియా, హైదరాబాద్/మంచిర్యాల**

వినాయక చవితి సందర్భంగా సింగరేణి కార్మికులు, అధికారులు పర్యావరణహిత పద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) గౌతమ్ పొట్రు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆయన ఉద్యోగులు, అధికారులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణహిత మైనింగ్‌కి మారుపేరుగా నిలుస్తున్న సింగరేణి సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తోందని గౌతమ్ పొట్రు వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన ప్రతిమలు నిమజ్జనం తర్వాత చెరువులు, జలాశయాల్లో కాలుష్యానికి కారణమవుతున్నాయని తెలిపారు. దీన్ని నివారించేందుకు మట్టి విగ్రహాలతో పూజ చేయడం శ్రేయస్కరమని, తద్వారా పూర్వీకుల సాంప్రదాయాన్ని కొనసాగించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం మార్కెటింగ్ టి.శ్రీనివాస్,



# అప్పుడే మంచిగ ఉండే ప్రారంభం

- చెన్నూర్ నుంచే బీఆర్ఎస్ వినూత్న కార్యాచరణ
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష పోరాటం ముమ్మరం చేయాలని జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. సోమవారం క్యాతనపల్లిలోని తన నివాసంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమై ఆయన "అప్పుడే మంచిగ ఉండే" కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. సుమన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి 20 నెలల్లో కాంగ్రెస్ వైఫల్యాలను బహిర్గతం చేయాలని సూచించారు. చెన్నూర్ నుంచే ఈ మహత్తర కార్యక్రమం ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామాల్లో చర్చలు పెట్టి కాంగ్రెస్ నేతలను నిలదీయాలని కార్యకర్తలకు సూచించారు. రైతులు యూరియా కోసం క్యూలో నిలబడే పరిస్థితి తమ పాలనలో ఎప్పుడూ రాలేదని గుర్తుచేశారు. సీసీఐ పత్తి కొనకపోయినా రైతుల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేసిన రోజులను గుర్తు చేశారు.

### అభివృద్ధి పనులు గుర్తు చేసిన సుమన్

చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని సుమన్ వివరించారు. మందమర్రిలో రూ.500 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన చేసినప్పటికీ అది బెల్లంపల్లికి తరలిపోయిందని చెప్పారు. రూ.1650 కోట్లతో చెన్నూర్ ఎత్తిపోతల పథకం, సుద్దాలలో రూ.15 కోట్లతో బ్రిడ్జి, బొక్కలగుట్టలో బ్రిడ్జి, గాంధారి మైసమ్మ జాతరకు రోడ్డు, రూ.500 కోట్లతో గాంధారి వనం వంటి ప్రాజెక్టులను గుర్తు చేశారు. మంత్రి వివేక్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, 45 వేల ఉద్యోగాలు, అగ్రికల్చర్, మైనింగ్ ఇనిస్టిట్యూట్లు, సింగరేణి ఫ్యాక్టరీలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏం జరిగాయో ప్రజలు అడగాలని సూచించారు.

### స్థానిక ఎన్నికల్లో వార్ వన్‌సైడ్

"అప్పుడే మంచిగ ఉండే" కార్యక్రమంలో భాగంగా 50 శాతం ఓటర్ల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కలెక్టరుకు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 28 నుంచి చెన్నూర్, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీలు, భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఇది 15 రోజులు కొనసాగుతుందని వివరించారు. సక్రమంగా దృష్టి పెడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వన్‌సైడ్ ఫలితమని ధీమా వ్యక్తం చేశారు. జైపూర్ మండలం వేలాలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేముల తిరుపతి గౌడ్, కాంగ్రెస్ రైతు సమితి కోఆర్డినేటర్ సోదరి బాపు ఉన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ నాయకులు రాజారమేశ్, మధూకర్రెడ్డి, రవీందర్, రాంలాల్ గిల్డా పాల్గొన్నారు.

